## నేడు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

**విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం పది గంటల నుంచి జరుగుతాయని సీఈఓ ఎం.పోలినాయుడు తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన ఉదయం 10 గంటలకు రెండు, ఐదు, 11 గంటలకు మూడు, నాలుగు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి, ఆరు, ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని, ఈ సమావేశాలకు సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

# అడ్డగోలుగా ప్లానింగ్!

- మాస్టర్ ప్లాన్‌లో రోడ్లు మాయం చేస్తున్న ఘనులు
- కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ నేతలదే హవా
- రోడ్డు లేకుండానే బహుళ అంతస్థులకు పర్మిషన్లు
- అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయం నిర్మించినా చోద్యం చూసిన అధికారులు
- అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లని వైనం
- అనకాపల్లి జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం తీరు



పట్టణంలో 84వ వార్డు శివారులో రోడ్డు లేని ప్రాంతంలో చేసిన బహుళ అంతస్తుల నిర్మాణాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం అక్రమాలకు అడ్డాగా మారిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు అలవాటు పడిన కొందరు టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు కొత్త ప్రభుత్వం వచ్చినా తీరు మార్చుకోవడం లేదు. వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులు, ఉద్యోగులు యథావిధిగా ప్రతి పనికి రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతూ అడ్డగోలు నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు.**



అనకాపల్లి పట్టణంలో అక్రమ కట్టడాలతో కుంచించుకుపోయిన రఘురామ్ కాలనీకి వెళ్లే 40 అడుగుల రోడ్డు

అనకాపల్లి జోనల్ కార్యాలయం పరిధిలోని ఐదు వార్డుల్లో యథేచ్ఛగా టౌన్‌ప్లాన్ విభాగం అనుమతులు లేకుండానే అక్రమ కట్టడాలు సాగిపోతున్నా పట్టించుకున్నవారే కరువయ్యారు. ఏదైనా భవన నిర్మాణ పనులు చేపట్టాలంటే టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులన్నీ ముందుగా తీసుకున్న తరువాతే భవన నిర్మాణ పనులు చేపట్టాలి. పట్టణ పరిధిలో సెల్లార్లు, సెట్ బ్యాక్ వదలకుండానే బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు సాగిపోతున్నాయి. స్థానిక రింగ్ రోడ్డు కూడలి, సుంకరమెట్టి జంక్షన్, ఎన్టీఆర్ స్టేడియం, గవరపాలెం, రఘురామ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇటీవల పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలకు అనుమతులు జారీ చేశారు. అక్రమ కట్టడాల వెనుక స్థానిక వైసీపీ నాయకుల అండదండలు ఉండడంతో వాటిపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఉదాహరణకు ఎక్కడైనా చిన్న నిర్మాణ పనులు ప్రారంభమైతే హడావుడి చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు అనకాపల్లి మండలం రాజుపాలెం రెవెన్యూ పరిధిలో ఏడాది కాలంగా ఎటువంటి అనుమతులు పొందకుండానే వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయం పేరుతో భారీ భవన నిర్మాణం జరుగుతున్నా అటువైపు కన్నెత్తి ... మిగతా 6వ పేజీలో

# మొక్కుబడులే..

## తగ్గిన విద్యార్థుల ప్రవేశాలు

- వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో కుదేలైన ప్రాథమిక పాఠశాలలు
- ఒకరిద్దరు విద్యార్థులకే పరిమితమైన విద్యాలయాలు
- 117 నంబరు జీవోతో భ్రష్టు పట్టిన విద్యా రంగం

చోడవరం, జూన్ 28:

**"విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చాం.. యూనిఫాం ఇచ్చాం.. బూట్లు ఇచ్చాం.. చక్కని భవనాలు కట్టాం. విద్యావ్యవస్థకు ఎనలేని మేలు చేశామంటూ" గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అడ్డగోలు నిర్ణయాల ప్రభావం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలపై తీవ్రంగానే పడింది. ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను దూరంగా ఉన్న హైస్కూళ్లలో విలీనం చేసిన నిర్ణయంతో విద్యార్థులు లేక ప్రాథమిక పాఠశాలలు దయనీయస్థితికి చేరిపోయాయి. ప్రభుత్వం తీసుకున్న బడుల విలీనం ప్రభావంతో గత ఏడాదే ఒకటి, రెండు తరగతుల్లో ప్రవేశాలు తగ్గిపోగా, ఈ ఏడాది కూడా పరిస్థితిలో ఏ మాత్రం మెరుగుపడలేదు. గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రవేశాలు తగ్గిపోవడం గమనార్హం.**



గవరవరంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



గవరవరం ప్రభుత్వ పాఠశాల భవనం

ఒకటి, రెండు తరగతుల్లో కొత్త విద్యార్థుల చేరికలు లేకపోవడంతో గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి. వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో గ్రామాల్లోని చిన్నారులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందంటూ విద్యావంతులు, ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని విద్యారంగ నిపుణులు అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన జీవో నంబరు 117 వల్ల విద్యారంగం భ్రష్టుపట్టడంతో పాటు, ప్రాథమిక పాఠశాలల భవిష్యత్తు పూర్తిగా దెబ్బతీసేందని అంటున్నారు.

### తగ్గిపోయిన విద్యార్థులు

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు కలిపి 61 ఉన్నాయి. వీటిలో గత ఏడాది ఒకటో తరగతిలో 249 మంది విద్యార్థులు చేరితే.. ఈ ఏడాది 187కి పడిపోయింది. ఇక గత ఏడాది రెండో తరగతిలో 296 మంది విద్యార్థులుంటే.. ఈ ఏడాది 287 మందికి తగ్గింది. మండలంలోని చాలా పాఠశాలలు కేవలం ఒకరిద్దరు ... మిగతా 6వ పేజీలో

## నేడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాక



**విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):** అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం నగరానికి రానున్నారు. సభాపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా జిల్లాకు వస్తుండడంతో ఘనంగా స్వాగతం పలికేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన శనివారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో బయలుదేరి పది గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా దసపల్లా హోటల్‌కు వెళతారు. అక్కడ ఆయన్ను నగర ప్రముఖులు, అధికారులు, టీడీపీ నాయకులు కలవనున్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత అనకాపల్లి వెళ్లి నూకాంబికా అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడ నుంచి శెట్టిపాలెం పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకొని భారీ ర్యాలీతో నర్సీపట్నం చేరుకుంటారు. సాయంత్రం ఐదు గంటలకు నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నాలుగు మండలాల టీడీపీ నాయకులు, అభిమానులు పౌర సన్మానం, బహిరంగ సభ ఏర్పాటు చేశారు



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావును అభినందిస్తున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్

# ఏయూ వీసీ అవుట్

## రిజిస్ట్రార్ జేమ్స్ కూడా...

- విద్యార్థి, అధ్యాపక సంఘాల ఆందోళనలతో ఎట్టకేలకు రాజీనామా
- రాష్ట్రంలోనే వివాదాస్పద వీసీగా పేరుగాంచిన ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి
- వర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చారనే విమర్శలు
- అడ్డగోలుగా నియామకాలు.. అస్మదీయులకు పదవులు
- నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు
- వీసీ, రిజిస్ట్రార్‌ల రాజీనామాతో క్యాంపస్‌లో సంబరాలు
- వీసీ పోస్టు ఎవరికి దక్కుతుందో జాబితాలో పలువురు పేర్లు



వీసీ ప్రసాదరెడ్డి



రిజిస్ట్రార్ జేమ్స్

**విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఆయన అనుంగ శిష్యుడు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌లు శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుంచి వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా చేయాలంటూ వర్సిటీలో నిరశన దీక్షలు కొనసాగుతున్నాయి. ప్రసాదరెడ్డి, జేమ్స్ స్టీఫెన్‌ను తొలగించాలంటూ ఏయూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు, గెస్ట్ ఫ్యాకల్టీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు వీసీ ఛాంబర్‌లో ఇప్పటివరకూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటం ఏర్పాటు చేయకపోవడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు, జనసేన కార్యకర్తలు గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ధర్నా చేశారు. ఆందోళనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందన్న సమాచారం అందడంతోనే వీసీ, రిజిస్ట్రార్‌లు శుక్రవారం రాజీనామా చేసినట్టు చెబుతున్నారు. వీసీ తన రాజీనామాను గవర్నర్‌కు పంపించగా, అంతకుముందే రిజిస్ట్రార్ జేమ్స్ తన రాజీనామాను వీసీగా ఉన్న ప్రసాదరెడ్డికి అందించారు. వీసీ తాను ... మిగతా 6వ పేజీలో



## టోల్ గేటు చార్జీలు రద్దు

**అనకాపల్లి టౌన్, జూన్ 28:** పీటీడీ బస్సు ప్రయాణికులకు శుభవార్త. ఇప్పటివరకు వసూలు చేసే అగనంపూడి టోల్‌గేటు చార్జీలు శనివారం నుంచి నిలుపుదల చేయనున్నారు. దీనివల్ల అనకాపల్లి-విశాఖపట్నం రాకపోకలు సాగించే ప్రయాణికులపై పది రూపాయల భారం శనివారం నుంచి తగ్గనుంది. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో అగనంపూడి టోల్‌గేటును తొలగించడంతోపాటు సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, పార్టీ నాయకులు టోల్‌గేటు చార్జీలు రద్దు చేయాలని కోరుతూ గురువారం డీపీటీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను డిపో అధికారులు రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో టోల్‌గేటు ఫీజును వసూలు చేయవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు అనకాపల్లి నుంచి విశాఖకు వెళ్లేందుకు మెట్రో బస్సుల్లో రూ.65 చెల్లిస్తున్న ప్రయాణికులు శనివారం నుంచి రూ.55లకే ప్రయాణం చేసే అవకాశం లభించింది. అదే పల్లెవెలుగు బస్సుల్లో రూ.50 లకే ప్రయాణం చేయవచ్చును.

## గోవాడ చెరకు రైతులకు ఊరట

- నేడు మరో రూ.15.32 కోట్లు బకాయిలు జమ
- షుగర్స్ ఎండీ వి. సన్యాసినాయుడు

**చోడవరం, జూన్ 20:** గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి గత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు ఈనెల 29వ తేదీన మరో రూ.15.32 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్టు గోవాడ షుగర్స్ ఎండీ వి.సన్యాసినాయుడు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు ఇప్పటి వరకు మూడు విడతలుగా పేమెంట్లు చేశామన్నారు. ఇక చివరి విడతలో ఫిబ్రవరి 16 నుంచి ఫ్యాక్టరీ క్రషింగ్ చివరి తేదీ మార్చి 12 వరకూ చెరకు సరఫరా చేసిన 6,346 మంది రైతులకు రూ.15.32 కోట్లు చెల్లించడానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది చివరిలో ప్రారంభమయ్యే క్రషింగ్ సీజన్‌కు రైతులంతా చెరకు సాగు చేపట్టి ఫ్యాక్టరీ అభివృద్ధికి సహకరించాలని ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు విజ్ఞప్తి చేశారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ వివిధ శాఖల సిబ్బందికి అధికారులకు సూచన



అనకాపల్లిలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న జెడ్సీ అయ్యప్పనాయుడు

**అనకాపల్లి టౌన్, జూన్ 28 :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు సూచించారు. వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు అతిసార వ్యాధి సోకకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈ క్యాంపెయిన్ కార్యక్రమం జూలై ఒకటో నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రెండు నెలలు పాటు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా డయేరియా రహిత అనకాపల్లి జోన్‌గా గుర్తింపు వచ్చేలా అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. రోడ్ల పైన, ఇతర చోట్ల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కశింకోట :** బయ్యవరంలో డయేరియా, మలేరియా వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కశింకోట పీహెచ్సీ వైద్యాధికారి ఎస్.తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డయేరియా, మలేరియా వంటి రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాచి చల్లార్చిన నీళ్ల మాత్రమే తాగాలని, క్లోరినేషన్ అయిన నీటిని తీసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి పరమానందరావు, విజయలక్ష్మి, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

**పరవాడ :** డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ చంద్రశేఖరదేవ్ సూచించారు. శుక్రవారం ఆయన పరవాడలో స్థానిక వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలతో పాటు బోధకాలు వ్యాధి ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వైద్య సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రతను అడిగి తెలుసుకున్నారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమ లార్వా పెరగకుండా తీసుకోవాల్సిన నీరు నిల్వ ఉన్న పల్లపు ప్రాంతాలను పర్యవేక్షించి దోమలు ఉత్పత్తి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి వైద్యాధికారిణి హారికకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఎస్‌వోపి రామచంద్రరావు, సీహెచ్‌ఓ ఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ ఎస్.జానకిరామన్, ఫార్మసిస్ట్ విజయకుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కుబడులే..

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులతోనే నడుస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. మండలంలో ఒకటి, రెండు తరగతుల్లో చదివే అత్యధిక విద్యార్థుల సంఖ్య 31 అంటే మిగిలిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని గవరవరంలో ఒకటో తరగతిలో ఒక విద్యార్థి, రెండో తరగతిలో ఒక విద్యార్థి ఉన్నారు. ఈ గ్రామంలో నాడు-నేడు కింద పాఠశాల భవనాన్ని అందంగా తయారుచేసిన మీదట, ఆ పాఠశాలలోని మూడు నుంచి ఐదు విద్యార్థులను హైస్కూల్‌కు తరలించేశారు. దీంతో మిగిలిన పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపించివేశారు. ఆ పాఠశాలలో విద్యార్థులకు చక్కగా బోధన అందించే ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థులు ఇద్దరే ఉండడం గమనార్హం. ఇక మండలంలోని అంకుపాలెం, కోమటివీధి పాఠశాలల్లో ఈ ఏడాది ఒకటో తరగతి ప్రవేశాలు లేవు. మిగిలిన పాఠశాలల్లో సైతం ఒకరు లేదా ఇద్దరు చేరారు. మండలంలోని రెండు పాఠశాలల్లో మాత్రం ఒకటో తరగతిలో పది మంది విద్యార్థులు చేరారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన వారి సంఖ్య సింగిల్ నంబరులోనే ఉంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు కలిపి పది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలే ఎక్కువగా ఉన్నాయి. అడ్డూరులో 6, బెన్నవోలులో 5, జన్నవరంలో 6, రామజోగిపాలెంలో 5, చాకిపల్లిలో 4, భోగాపురంలో 6, ముద్దుర్తిలో 9, ఖండేపల్లిలో 8, జుత్తాడలో 4, నసరయ్యపేటలో 4 ఇలా సింగిల్ నంబరులోనే విద్యార్థుల సంఖ్య ఉంది. ఇక సింహాద్రిపురంలో రెండో తరగతిలో ఒకరు. పట్టణంలోని చందకవీధిలో ఒకటో తరగతికి ఒకరు. రెండో తరగతికి ఒకరు. అంకుపాలెం ఇద్దరు ఇలా విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ ప్రాథమిక బడులలో ఈ విద్యార్థుల సంఖ్య విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తికి కూడా పొంతన లేకుండా ఉండడం గమనార్హం. వేలాది రూపాయల వేతనాలతో పనిచేసే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నప్పటికీ, వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన అస్తవ్యస్త విధానాలతో వేల రూపాయలు ఖర్చు పెట్టి మరీ విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపించివేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దే చర్యలు చేపడితే తప్ప గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు మునుపటి కళ రాదని అంటున్నారు.

## అడ్డగోలుగా ప్లానింగ్!



రఘురామ్ కాలనీలో ఈ స్థలం మీదుగానే రోడ్డు ఉండాలి

... 5వ పేజీ తరువాయి

చూడలేదు. ఇటీవల మీడియాలో ఈ విషయం బయటకు పొక్కడంతో హడావిడిగా నోటీసులు జారీ చేశారు.

### అడ్డగోలు నిర్మాణాలకు పచ్చజెండా

అనకాపల్లి జీవీఎంసీ పరిధిలో గడిచిన మూడు నెలలుగా పూర్తికాల టౌన్ ప్లానింగ్ అధికారి లేరు. ఇక్కడ పనిచేస్తున్న ఏటీపీ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఎన్నికల ముందు వేరొకరిని నియమించారు. అయినా అడ్డగోలు అనుమతులు, అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. స్థానిక వైసీపీ నేతలే మధ్యవర్తులుగా ఉంటూ అక్రమ నిర్మాణదారులతో బేరసారాలు కుదిర్చి, అడ్డగోలుగా భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారులు తమకు అందాల్సిన వాటాలు అందితే చాలు బహుళ అంతస్తుల నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. అనకాపల్లి పట్టణ పరిధిలో 84 వార్డులోని రఘురామ్ కాలనీలో గతంలో పనిచేసిన టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి ఒకరు వైసీపీ నేతల స్థలాలకు ప్రయోజనం చేకూర్చేందుకు వీలుగా ఏకంగా పట్టణ టౌన్ ప్లాన్ బ్లూప్రింట్‌లోని 80 అడుగుల రోడ్డును పూర్తిగా కనిపించకుండా చేశారనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల ముందు వరకు పనిచేసి బదిలీపై వెళ్లిపోయిన సదరు అధికారి లక్షలు వసూలు చేసి బ్లూప్రింట్‌లో మార్పులు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పట్లో ఇదే కాలనీలో మరొక వైసీపీ నేతకు అనుకూలంగా 60 అడుగుల రోడ్డును బ్లూప్రింట్‌లో కేవలం 10 అడుగుల రోడ్డుగా మార్పులు చేశారు. ఈ అడ్డగోలు వ్యవహారంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు భారీగానే ముడుపులు గుంజినట్టు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి టౌన్‌ప్లాన్ విభాగంలో బ్లూప్రింట్‌లో ఎటువంటి మార్పులు చేయాల్సి వున్నా, ఆయా ప్రాంతాల్లో ఉన్న లేఅవుట్ పరిధిలో భూ యజమానులతో చర్చించి, జీవీఎంసీ కమిషనర్ ఆమోదం పొందాలి. కానీ రఘురామ కాలనీలో టౌన్ ప్లానింగ్ అధికారులు 80 అడుగుల రోడ్డును కనిపించకుండా చేయడమే కాకుండా, 60 అడుగుల రోడ్డును ఏవిధంగా 10 అడుగులు రోడ్డుగా చూపుతున్నారో అర్థం కాని ప్రశ్నలుగా మారిపోయాయి. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అంతేకాకుండా ఇదే రఘురామ్ కాలనీకి సమీపంలో ఎటువంటి రోడ్లు లేకుండానే ప్రస్తుతం వున్న టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు కొత్తగా మరికొన్ని బహుళ అంతస్తుల నిర్మాణ పనులకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రసన్నం చేసుకుంటే చాలు.. అడ్డగోలు నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తున్నారు. 84వ వార్డులోని రఘురామ్ కాలనీకి సమీపంలో ప్రస్తుతం జరుగుతున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కనీసం రోడ్డు లేకుండానే పెద్ద పెద్ద అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తున్నారంటే అధికారుల అడ్డగోలు వ్యవహారాలు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చిన నేపథ్యం లోనైనా అనకాపల్లి పట్టణంలో అక్రమ కట్టడాలకు అడ్డగోలు అనుమతులు ఇవ్వకుండా ప్రక్షాళన చర్యలు చేపట్టాల్సిన అవసరం వుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# కర్మాగారాల్లో స్థానికులకు ఉపాధి

▸▸ ఏపీఐఐసీ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే 'సుందరపు' సూచన ▸▸ మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని హామీ

**అచ్యుతాపురం, జూన్ 28 :** కర్మాగారాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని సుమారు ఇరవై వేల ఎకరాల్లో ఏపీఐఐసీ కర్మాగారాలు నిర్మించినా, స్థానికులకు ఎక్కువ అవకాశాలు కల్పించలేదన్నారు. త్వరలో మరిన్ని కర్మాగారాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందుగా అర్హులైన స్థానికులకు తప్పనిసరిగా ఉపాధి కల్పించాలని కోరారు. తొలుత ఈ మండలాల్లో నిర్వాసిత కుటుంబ సభ్యులకు, ఆ తర్వాత నియోజకవర్గంలో గల అర్హులైన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం ఇతరులకు అవకాశాలు ఇవ్వాలన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు



సమావేశంలో ఏపీఐఐసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

రూపొందించాలన్నారు. కర్మాగారాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే, సామాజిక బాధ్యతలో భాగంగా కర్మాగారాల యాజమాన్యాలు నియోజకవర్గంలో గల గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు

## రైతులకు అండగా ప్రభుత్వం

▸▸ రాయితీ విత్తనాల పంపిణీలో ఎమ్మెల్యే 'పంచకర్ల'

**సబ్బవరం, జూన్ 28 :** కూటమి ప్రభుత్వం రైతాంగానికి అన్నింటా అండగా ఉంటుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఏవో పోతల సత్యనారాయణ ఆధ్వర్యంలో రాయితీ విత్తనాల పంపిణీలో మాట్లా డారు. వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకటి నుంచి సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయనున్నామని వివ రించారు. విశాఖ జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో మహేశ్, ఏవో షేక్ బాబూరావు, వైస్ ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద. అనకాపల్లి వ్యవసాయ సహాయకులు ఎం.రామారావు, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**పాయకరావుపేట రూరల్ :** శ్రీరాంపురం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. నియోజక వర్గం తెలుగు యువత అధ్యక్షుడు చించలపు పద్దు, సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, మాజీ సర్పంచ్ సన్యాసమ్మ, జనసేన నాయకులు పెరుమాళ్ళ మల్లికుమార్, టీడీపీ నాయకులు శాంతమ్మ, శివయ్య, సుబ్బలక్ష్మి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

**అచ్యుతాపురం :** ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం పంచాయతీల్లో శుక్రవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఆర్‌బీకే ఇన్‌చార్జి లోకేష్, నాయకులు కూనిశెట్టి సత్తిబాబు, అగ్గాల హనుమంతరావు, భాస్కరరావు, గూడెల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

**పరవాడ :** ఇక్కడి వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులకు వరి విత్తనాల పంపిణీ చేపట్టారు. మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి, టీడీపీ సీనియర్ నాయకులు పైలా సన్యాసిరావు, పైలా బుజ్జి, వర్రి చంద్రశేఖర్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి



ఎలమంచిలిలో పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

**ఎలమంచిలి, జూన్ 28 :** పట్టణంలోని పీవీ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. గాయత్రి సేవా ట్రస్టు వేద పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన విగ్రహానికి ట్రస్టు కార్యదర్శి పెద్దింటి సూర్యనారాయణ మూర్తి, జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు. పీవీ దేశానికి అందించిన సేవలను కీర్తించారు. ఆయన ఆర్థిక సంస్కరణలను వివరించారు. ఈ కార్యక్రమంలో గోశాల చైర్మన్ రాజకొండ పట్టాభిరామయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ గుప్తా, స్థానిక నాయకులు లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్, కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధి గౌరీపతి

**కొత్తూరు, జూన్ 28 :** అనకాపల్లిలోని వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఉన్న సాయిబాబా మందిరంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని శుక్రవారం నిర్వహించారు. అనకాపల్లి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ భైరవ భట్ల దక్షిణామూర్తి ముఖ్య అతిథిగా హాజరై పీవీ సేవలను కీర్తించారు. బ్రాహ్మణ సంఘం నాయకులు కన్నేపల్లి గౌరీపతి, కాంగ్రెస్ నాయకులు దత్తు, మాజీ కౌన్సిలర్ విన్నకోట రాజా సతీష్, లట్టాల మురళీ, గంటి రవికుమార్, పేరూరి భోగలింగేశ్వర శర్మ, బమ్మిడిపాలి కిరణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ పెట్రోల్ విక్రయించారని ఆరోపణ

▸▸ శ్యాంపిల్స్ సేకరించామని తహసీల్దార్ వెల్లడి

**పాయకరావుపేట, జూన్ 28 :** పట్టణంలో ఉన్న ఓ బంక్‌లో నీరు కలిపిన పెట్రోల్‌ను వాహనాలకు కొడుతున్నారంటూ గోవింద్ అనే వ్యక్తి ఆరోపించారు. ఇక్కడి ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న బంక్ వద్దకు శుక్రవారం రెండు బాటిళ్ల నీరు కలిపి ఉన్న పెట్రోల్‌ను తీసుకువచ్చిన ఆయన దీనిపై బంక్ సిబ్బందిని నిలదీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి తన మోటారు సైకిల్‌లో రూ.500 పెట్రోల్ పోయించుకుని ఇంటికి వెళ్లానన్నారు. శుక్రవారం ఉదయం తన వాహనం ఎంత స్టార్ట్ చేసినా స్టార్ట్ కాకపోవడంతో అనుమానవ వచ్చి ట్యాంకులో రాత్రి పోయించిన పెట్రోల్‌ని బాటిళ్ళలోకి తీసి చూడగా పెట్రోల్‌లో అధిక మొత్తంలో నీరు కలిసి ఉందన్నారు. దీనిపై బంక్ సిబ్బంది అడిగితే సరైన సమాధానం చెప్పడంలేదని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ సూర్యనారాయణను వివరణ కోరగా, పెట్రోల్‌లో నీరు కలపడంపై ఫిర్యాదు అందిందని, ఆర్ఐని పంపించి శ్యాంపిల్స్ సేకరించామని తెలిపారు. కల్తీ జరిగిందా లేదా అన్నదానిపై పరిశీలనకు పంపుతున్నామని వివరించారు.



పెట్రోల్‌లో నీరు కలిసిందని బాటిళ్లు చూపిస్తున్న గోవింద్

## నేడు రాంబిల్లి మండల సమావేశం

**రాంబిల్లి, జూన్ 28 :** ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హాజరు కానున్నారని ఎంపీడీవో వెంకటాచలం తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

## ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై ఫిర్యాదు

**ఎలమంచిలి, జూన్ 28 :** పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎంఈవో మీనాక్షికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ వినతి పత్రాన్ని అందజేశారు. ఎలమంచిలి ప్రాంతంలో కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఇటువంటి వాటిపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు దుర్గారావు, శ్రీను, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏయూ వీసీ అవుట్

... 5వ పేజీ తరువాయి

రాజీనామా చేయడానికి ముందే అకడమిక్ డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ కిశోర్‌బాబుకు రిజిస్ట్రార్‌గా అడిషనల్ చార్జ్ అప్పగించారు.

### వివాదాస్పద నిర్ణయాలే కారణం..

వీసీగా ప్రసాదరెడ్డి తీసుకున్న అనేక నిర్ణయాలు ప్రస్తుతం ఆయనపై తీవ్ర వ్యతిరేకతకు కారణమయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్ప టివరకూ తొలుత ఇన్‌చార్జిగా, ఆ తరువాత పూర్తిస్థాయి వీసీగా కొనసాగిన ప్రసా దరెడ్డి... వర్సిటీని ఒకరకంగా ఆ పార్టీ కార్యాలయంగా మార్చేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఆయన తల్లి విజయలక్ష్మి, రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి పుట్టినరోజు వేడుకలను తన ఛాంబర్‌లో నిర్వహించారు. అలాగే వీసీగా ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయి.

ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను నిబంధనలకు విరుద్ధంగా మూడుసార్లు రిజిస్ట్రార్‌గా తీసుకు న్నారు. ఆ తరువాత కూడా ఆయనకు ఏయూలో ఎన్నడూ లేని విధంగా ఓఎస్‌డీ పోస్టును సృష్టించి బాధ్యతలను అప్పగించారు. అదేవిధంగా ఏయూతో సంబంధంలేని బయటి వ్యక్తి అయిన జేమ్స్ స్టీఫెన్‌ను రిజిస్ట్రార్ సీటులో కూర్చో బెట్టారు. యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చైర్ ప్రొఫెసర్‌గా ఉన్న వ్యక్తికి రిజిస్ట్రార్ పోస్టు దక్కేలా చక్రం తిప్పారు. ఇది అప్పట్లోనే సంచలనం అయింది.

### అస్మదీయులకు పదవుల పందేరం

వీసీ ప్రసాదరెడ్డి తన హయాంలో అస్మదీయులకు పెద్ద ఎత్తున పదవుల పందేరం చేశారన్న విమర్శలు ఉన్నాయి. తనకు కావాల్సిన వారిని కీలక స్థానాల్లో కూర్చోబెట్టుకున్నారు. ఇరవై మందికిపైగా రిటైర్డ్ ఉద్యోగులకు కీలక స్థానాలను కట్టబెట్టారు. చైర్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, గౌరవ ప్రొఫెసర్లు పేరుతో ఎంతో మందిని నియమించుకుని భారీగా వేతనాలు ఇచ్చారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్లను, వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలను కూడా వీసీ ప్రసాదరెడ్డి నియమించు కున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వీసీ వర్సిటీలోకి తీసుకువచ్చి కీలక విభాగాల్లో నియమిం చారు. అలాగే, రిటైర్డ్ పోలీస్ అధికారికి భారీగా వేతనాన్ని ఇచ్చి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించుకున్నారు. అంతేగాకుండా పదుల సంఖ్యలో సెక్యూరిటీ గార్డులను నియమించుకుని ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటుచేసుకున్నారన్న ఆరో పణలు ఉన్నాయి. అదే సమయంలో తనకు నచ్చని వారిని పక్కనబెట్టేశారు. సుమారు 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీని తొలగించేందుకు 28కిపైగా కోర్సులను రద్దు చేసేశారు.

### పచ్చని చెట్లపై వేటు

జాతీయ స్థాయిలో వర్సిటీ ఖ్యాతిని మంటగలిపే మరో చర్యకు వీసీ ప్రసాదరెడ్డి పాల్పడ్డారు. వందలాది ఎకరాల్లో ఉన్న వేలాది వృక్షాలు, చెట్లను తొలగించేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే వంకతో పచ్చదనంపై వేటు వేశారు. ఓ ప్రైవేటు వ్యక్తికి ఈ స్థలాన్ని కట్టబెట్టేందుకు యత్నించారని, అన్నివర్గాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని వర్సిటీలోని అధికారులే చెబుతున్నారు.

### విద్యార్థులకు దూరంగా వీసీ కార్యాలయం

విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా వీసీ కార్యాలయానికి వచ్చి చెప్పుకునే అవకాశాన్ని ప్రసాదరెడ్డి పూర్తిగా దూరం చేశారన్న విమర్శలు ఉన్నాయి. తాను బాధ్యతలు చేపట్టిన వెంటనే వీసీ కార్యాలయం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయించారు. ఎవరైనా లోపలకు వెళ్లాలంటే సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి. గతంలో ఏవైనా ఇబ్బందులుంటే విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించేవి. వీసీగా ప్రసాదరెడ్డి వచ్చిన తరువాత అటువంటి పరిస్థితే లేకుండా పోయింది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా భరించాల్సిందే తప్ప.బయటకు చెప్పకోలేని పరిస్థితి విద్యార్థులకు ఏర్పడింది. మరో వైపు అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా వర్సి టీలో గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం కూడా పెరిగిపోయింది. సాధారణంగా ప్రభుత్వాలు మారినా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఈ తరహాలో రాజీనామా చేయడం ఎప్పుడూ లేదు. కానీ, వీసీ ప్రసాదరెడ్డి వ్యవహారశైలే అందుకు దారి తీసిందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. వీసీ, రిజిస్ట్రార్‌ల రాజీనామాతో విద్యార్థి, అధ్యాపక సంఘాలు ఆనందాన్ని వ్యక్తంచేశాయి. సాయంత్రం ఐదు గంటలకు ఏయూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఐదేళ్ల నుంచి వీసీ ప్రసాదరెడ్డి కబంధ హస్తాల్లో చిక్కుకున్న ఏయూలో స్వేచ్ఛా యుత వాతావరణం ఏర్పడిందన్న ఆనందాన్ని వ్యక్తంచేశారు.

### వీసీ పోస్టుకు ప్రయత్నాలు

ప్రసాదరెడ్డి రాజీనామా చేయడంతో ఏయూ వీసీ పోస్టు కోసం పలువురు సీనియర్ ప్రొఫెసర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళం అంబేడ్కర్ వర్సిటీ వీసీగా పనిచేసి ప్రస్తుతం ఏయూలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ కూన రాంజీ, ఏయూ ఫారిన్ అఫైర్స్ డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ధనుంజయ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ నరసింహారావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ శశిభూషణ్, తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ఇన్‌చార్జి వీసీని నియమించి, ఆ తరువాత పూర్తిస్థాయి వీసీ ఎంపిక కోసం సెర్చ్ కమిటీని ప్రభుత్వం వేయనున్నది.

## చంద్రబాబును కలిసిన 'బుద్ద'



చంద్రబాబు దంపతులకు చిత్రపటాన్ని అందిస్తున్న బుద్ద

**అనకాపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులను శుక్రవారం ఉండవల్లిలోని వారి స్వగృహంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు కలిశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చంద్రబాబు, భువనేశ్వరి దంపతుల చిత్రపటాన్ని బహూకరించారు.

### ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

**నక్కపల్లి, జూన్ 28:** మండలంలో ఏడు వారాలుగా ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడి సీఐటీయు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రావల్సిన వేసవి అలవెన్సులు, పే స్లిప్పులు, మెడికల్ కిట్లు ఇవ్వాలన్నారు. జాబ్ కార్డులున్నవారికి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని, రెండు వందల రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.రాజేశ్, గొర్ల రమణ, పిక్కి శ్రీను, ఏడిద నవీన్, ఎం.శ్రీను, గొర్ల రాము, పల్లా శివ,రాజు తదితరులు పాల్గొన్నారు.

### బాధితులకు పరిహారం అందించాలని వినతి

**అనకాపల్లి రూరల్, జూన్ 28 :** జిల్లాలో నమోదైన అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ విజయభాస్కర్‌ను జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మునగపాక పోలీస్ స్టేషన్‌లోని ఎఫ్ఐఆర్ నంబర్ 48/2024కు సంబంధించి బాధితులకు పరిహారం అందించలేదని వివరించారు.

### ఉపమాక శివాలయం హుండీ లెక్కింపు

**నక్కపల్లి, జూన్ 28 :** ఉపమాక శివాలయంలో హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవదాయ శాఖ చోడవరం గ్రూప్ ఈవో ఎస్‌వీవీ సత్యనారాయణ, ఉపమాక శివాలయం ఈవో మురళీకృష్ణ, పర్యవేక్షణలో ఈ ప్రక్రియ సాగింది. మూడు నెలల కాలానికి రూ23,835 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో తెలిపారు. అర్చకులు వెలవలపల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఒకటిన పింఛన్ల పంపిణీ పూర్తికావాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

**నక్కపల్లి, జూన్ 28 :** మండలంలో జూలై ఒకటో తేదీన ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఒకటో తేదీన నూరుశాతం పెన్షన్లను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో ఏవో డి.సీతారామరాజు, ఎస్ఐ సన్నిబాబు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయంలో పాము కలకలం



మెట్ల కింద చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

**అచ్యుతాపురం, జూన్ 28 :** ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పాము కలకలం రేపింది. తహసీల్దార్ ఉంటున్న గదికి కుడి భాగంలో మెట్ల కింద చెత్తాచెదారం భారీగా పేరుకుపోయి ఉంది. ఇక్కడున్న బీరువాపై సిబ్బంది పామును చూశారు. ఈ అలికిడికి అది మెట్లకింద చెత్తాచెదారంలోకి వెళ్లిపోయింది. భయాందోళన చెందిన సిబ్బంది చెత్తను తొలగించినా పాము జాడ కానరాలేదు. అక్కడే ఉన్న కలుగులోకి వెళ్లి ఉంటుందని భావించిన వారంతా బితుబితుకుమంటున్నారు.

### అచ్యుతాపురంలో పారిశుధ్య పనులు



ఎక్స్‌కవేటర్‌తో కాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

**అచ్యుతాపురం, జూన్ 28 :** పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ సమస్యపై పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే సుందరపు విజయ కుమార్ అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధిపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా భవన యజమానులు, షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి జంక్షన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీంతో అంతా ముందుగా రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఉన్న తాత్కాలిక దుకాణాలను తొలగించారు. ప్రతి ఇంటితో పాటు షాపులకు పంచాయతీ తరపున డస్టుబిన్‌లను అందజేశారు. అలాగే, కాలువల్లో పూడుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగిస్తున్నారు.

క్రైం... crime news

## నేవీలోని ఎల్అండ్‌టీలో కార్మికుడి మృతి

రాంబిల్లి, జూన్ 28: ఇక్కడి నేవీలోని ఎల్అండ్‌టీలో ప్రమాదానికి గురై ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికుడు పంచనాన్ సాహూ (44) మృతి చెందినట్టు రాంబిల్లి ఇన్‌చార్జి సీఐ దీనబంధు తెలిపారు. గురువారం ఉదయం పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు పై నుంచి సాహూ కిందకు పడిపోయాడన్నారు. అతని తలకు తీవ్రగాయాలు కావడంతో కంపెనీ యాజమాన్యం అంబులెన్స్‌లో అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించిందన్నారు. అక్కడ చికిత్సలు పొందుతూ మృతిచెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## లారీని ఢీకొన్న వ్యాన్

» డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు » ధర్మవరం అగ్రహారం వద్ద ఘటన

ఎస్.రాయవరం, జూన్ 28: మండలంలోని ధర్మవరం అగ్రహారం సమీపం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డాడు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. అనకాపల్లి నుంచి తుని వైపు వెళుతున్న వ్యాన్ ధర్మవరం అగ్రహారం సమీపంలోకి వచ్చేసరికి ముందుగా వెళుతున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో వ్యాన్ ముందుభాగం నుజ్జయ్యింది. అందులోని డ్రైవర్‌కు తీవ్రంగా, క్లీనర్‌కు స్వల్పంగా గాయలయ్యాయి. వెంటనే వీరిని 108 వాహనంలో నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ విభీషణరావు మాట్లాడుతూ వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో నక్కపల్లి ఆస్పత్రి నుంచి అనకాపల్లి ఆస్పత్రికి తరలించారన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

## ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కశింకోట, జూన్ 28: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన కలగ అప్పారావు (47) పెట్రోల్ బంకులో పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నెల 23న మోటారు సైకిల్‌పై అనకాపల్లి వెళ్తుండగా, మార్గమధ్యలో బయ్యవరం జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలకు గురయ్యాడు. నాటి నుంచి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు జగదీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

# ఏయూను భ్రష్టు పట్టించారు..

వీసీ ప్రసాదరెడ్డి వ్యవహారశైలిపై 'ఎక్స్' వేదికగా

మానవ వనరుల శాఖ మాజీ మంత్రి,

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆగ్రహం

విశాఖపట్నం, జూన్ 28: ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రమాణాలు దిగజార్చిన పీవీజీడీ ప్రసాదరెడ్డి వైస్ చాన్సలర్‌గా కొనసాగడానికి అనర్హులని మానవ వనరుల శాఖ మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం 'ఎక్స్' వేదికగా చేసిన ట్వీట్‌లో వివిధ అంశాలపై ప్రసాదరెడ్డి తీరును విమర్శించారు. ఆంధ్ర ప్రజలు 93 శాతం సీట్లతో కూటమిని ఆశీర్వదిస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫొటోను వీసీ తన ఛాంబర్‌లో పెట్టకపోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. విద్యార్థులకు, ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తి వైసీపీ కార్యకర్తకంటే ఎక్కువగా ఆ పార్టీతో అంటకాగారని విమర్శించారు. ఐదేళ్లలో యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చారన్నారు. ల్యాబ్‌లు, ఈ-క్లాస్‌రూమ్‌లు, రీసెర్చ్, విద్యా ప్రమాణాలు పెంచడం కోసం ఇచ్చిన వందల కోట్ల రూపాయల రూసా నిధులను ఇతర పనులకు మళ్లించి ప్రసాదరెడ్డి దుర్వినియోగం చేశారని గంటా ఆరోపించారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సాధారణ లెక్చరర్‌గా ఉన్న స్టీఫెన్‌ను తీసుకొచ్చి నిబంధనలకు వ్యతిరేకంగా అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నియమించారన్నారు. అనంతరం ఎంతోమంది సీనియర్ ప్రొఫెసర్లు యూనివర్సిటీలో ఉన్నా స్టీఫెన్‌ను రిజిస్ట్రార్‌గా నియమించడం వైస్ ఛాన్సలర్ అధికార దుర్వినియోగానికి నిదర్శనమన్నారు.

### అర్హులను వదిలేసి రిటైర్డ్ ఉద్యోగులకు పునరావాసం

యూనివర్సిటీలో అర్హత ఉన్న ఉద్యోగులను పక్కనపెట్టి రిటైరైన వారికి ప్రసాదరెడ్డి అత్యున్నత పదవులు కట్టబెట్టారని పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారని, డీన్‌లు, డైరెక్టర్లు వంటి ముఖ్యమైన పోస్టులను మాజీలకు ఇచ్చారన్నారు.

### నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు

ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా అస్మదీయులైన 150 మందిని ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్ పేరుతో నియమించుకున్నారని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇలా..ఆయన సొంత డిపార్టుమెంట్ కంప్యూటర్ సైన్స్‌లో 30 మందిని నియమించుకున్నారన్నారు. అలాగే స్పెషల్ ఎగ్జామ్ పేరుతో సీబీడీ చీఫ్‌కు పట్టా ఇచ్చారని, ఇది దౌర్భాగ్యమైన సంప్రదాయమని పేర్కొన్నారు. గాంధీ విగ్రహం పక్కనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పెట్టించారని, యూనివర్సిటీల్లో రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టారని పేర్కొన్నారు. సైకాలజీ ప్రొఫెసర్‌ను విచిత్రంగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారన్నారు.

## 'పల్లా'కు జిల్లా నాయకులు శుభాకాంక్షలు



వేడుకలకు హాజరైన టీడీపీ జిల్లా నాయకులు

అనకాపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ శుక్రవారం మంగళగిరిలో చేపట్టిన బాధ్యతల స్వీకరణోత్సవానికి జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాడుగుల, ఎలమంచిలి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పీవీజీ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, నాయకులు డాక్టర్ నారాయణరావు, దూళి రంగనాయకులు, లాలం కాశీనాయుడు తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు

## పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 28: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. విశాఖ- కిరండోల్- విశాఖ పాసింజర్ రైళ్లకు (08551/085522) జూలై ఒకటి నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ ఏర్పాటు. అలాగే, విశాఖ- గుణుపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లకు (08522/08521) జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు జత చేయనున్నారు. ఇక, నామినేటెడ్ రోజుల్లో నడిచే విశాఖ - నాందేడు - విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20811/ 20812) జూలై రెండు నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు, విశాఖ - అమృతసర్ - విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20807/20808) జూలై రెండు నుంచి ఆగస్టు మూడు వరకు ఒక థర్డ్ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు జత చేస్తున్నారు. భువనేశ్వర్-ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (12845/ 12846) జూలై ఏడు నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్; భువనేశ్వర్ - చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (12830/12829) జూలై నాలుగు నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22871/22872) జూలై ఏడు నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అలాగే, భువనేశ్వర్ -పూణే- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైళ్లకు (22882/22881) జూలై రెండు నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్; భువనేశ్వర్ - పాండిచ్చేరి- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ రైళ్లకు (12892/12897) జూలై రెండు నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్; భువనేశ్వర్- రామేశ్వరం- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20896/20895) జూలై ఐదు నుంచి 28వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్; పూరి-యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22883/22884) జూలై ఐదు నుంచి 27వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేయనున్నట్టు డీసీఎం పేర్కొన్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 120.00 |
| లైవ్ ధర | 140.00 |
| విత్ స్కిన్ | 250.00 |
| స్కిన్ లెస్ | 260.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 530 |
| విజయనగరం | 534 |
| శ్రీకాకుళం | 534 |

# సమగ్ర విధానాల ద్వారా సాగు లాభసాటి

» కేవీకేల స్వర్ణోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే 'సుందరపు'

» రైతులకు అందిస్తున్న సేవలను వివరించిన కేవీకే చైర్మన్ శ్రీరామూర్తి



వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, జూన్ 28: సమగ్ర విధానాల ద్వారా వ్యవసాయం లాభసాటిగా మారవచ్చునని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని హరిపురంలో గల బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవ సంబరాల్లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా వ్యవసాయసాగు విస్తరణ పెంపుతో పాటు రైతులను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలన్నారు. గతంలో బీసీటీ ద్వారా జరిగిన అనేక కార్యక్రమాలు, ప్రయోగాలు తదితరాలను గుర్తుచేశారు. కేవీకే చైర్మన్ బి.శ్రీరామూర్తి మాట్లాడుతూ బీసీటీ, కేవీకే ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు గత ఐదు సంవత్సరాలుగా కేంద్ర గ్రామీణ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా నిర్వహించిన శిక్షణల గురించి తెలియజేశారు. బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా మాట్లాడుతూ కేవీకే ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను, రైతుల విజగాథలను, శాస్త్రవేత్తలు, రైతులు అందుకున్న ప్రశంసలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. అనంతరం జరిగిన శాస్త్రవేత్తలు, రైతుల చర్చాగోష్ఠిలో ఖరీఫ్‌లో చేపట్టవలసిన యాజమాన్య చర్యలపై చర్చించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉత్తమ రైతులను సత్కరించారు. శాస్త్రవేత్తలు బి.శ్రీహరిరావు, డాక్టర్ వానా ప్రసాద్‌రావు, బండి నాగేంద్రప్రసాద్, శ్రీకాంత్ గౌడ, విజయరాజ్ఞి, దివ్యసుధలతో పాటు జడ్పీటీసీ దూళి నాగరాజు, సర్పంచ్‌లు దూళి దేముడమ్మ, కిల్లాడ తాతబ్బాయి, బీసీటీ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలకు మంజూరు కాని నిధులకు ఆడిట్టా..?

» యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చినబ్బాయి ఆశ్చర్యం

» వాయిదా వేయాలని డీఈవో కార్యాలయంలో ఏడీ రమాజ్యోతికి వినతి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

అనకాపల్లి రూరల్, జూన్ 28: జిల్లాలోని 2023-2024 విద్యా సంవత్సరంలో ఏ పాఠశాలకు నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఎలాంటి నిధులు మంజూరు కాలేదని, కానీ వాటికి సంబంధించి ఆడిట్ అంటుండడం విడ్డూరంగా ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చినబ్బాయి అన్నారు. ఈ మేరకు ఇక్కడి కొండకొప్పాకలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏడీ రమాజ్యోతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఒకటి, రెండు తేదీల్లో నర్సీపట్నం, కశింకోట కేంద్రాల్లో 2023- 2024 సంవత్సరానికి గాను పాఠశాలల నిర్వహణ గ్రాంట్లకు జిల్లాలోని అన్ని పాఠశాలలకు పైన పేర్కొన్న కేంద్రాల్లో ఆడిట్ నిర్వహిస్తామని ఎస్ఎస్ఏ అధికారులు షెడ్యూల్ విడుదల చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ఏ పాఠశాలలకు నిర్వహణ గ్రాంటు మంజూరు కాలేదన్నారు. అలాంటప్పుడు ఆడిట్ ఏ విధంగా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ ఆడిట్‌ను వాయిదా వేయాలని కోరారు. దీనిపై ఏడీ నాగజ్యోతి బదులిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఏడీని కలిసిన వారిలో ఫెడరేషన్ ప్రతినిధి ప్రకాష్, స్వామి తదితరులు ఉన్నారు.

# వైసీపీ ప్రభుత్వంలో రేషన్ డీలర్లకు అన్యాయం

» సంబంధం లేని వ్యవస్థతో ఇబ్బందులకు గురిచేశారు

» జిల్లా రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు

కశింకోట, జూన్ 28: వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్లకు సంబంధం లేని వ్యవస్థను తీసుకొచ్చి పలు ఇబ్బందులకు గురిచేసిందని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు దివి లీలా మాధవరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఇక్కడ జరిగిన అనకాపల్లి జిల్లా రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గవర్నమెంటు ఆఫ్ ఇండియా నెలలో 30 రోజులు ప్రజా పంపిణీ వ్యవస్థ వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని చెప్పినప్పటికీ ఆ నిబంధనలకు విరుద్ధంగా డీలర్లతో పాటు ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసి ప్రజలను, డీలర్లను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. డీలర్ల వ్యవస్థ ఉన్నప్పుడు ప్రతి వినియోగదారుడు డిపోకు వెళ్లి రేషన్ సరకులు తీసుకునేవాడన్నారు. ఎండీయూ వ్యవస్థ తీసుకురావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు పేదలు కూలి పనులకు వెళ్లలేక ఆర్థికంగా నష్టపోయేవారన్నారు. అందుకే రేషన్ డీలర్ల ద్వారా సరకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డీలర్లకు రూ.7,500లు గౌరవవేతనంతో పాటు రూ.100 నుంచి 150లు కమీషన్ ఇవ్వాలన్నారు. రేషన్ షాపులను విలేజ్ మాల్స్‌గా మార్చి అదనపు ఆదాయం కల్పించడమే కాకుండా పెన్షన్ పంపిణీ రేషన్ డీలర్ల ద్వారా చేయించాలని కోరారు. అలాగే మీ-సేవ సౌకర్యాలు కూడా రేషన్ షాపుల్లో అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కొప్పాక శేషు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి గంగాదర్ గౌడ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు గంట్యాడ అప్పలరాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి మూర్తి, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు నాయుడు, బుజ్జి, దయాల్‌రాజు, శ్రీను, నర్సీపట్నం నుంచి శ్రీనివాస్, పాయకరావుపేట హరి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చెరకుపల్లి ప్రాఠశాలలో సమస్యలు వాస్తవమే



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో



పునాదుల వరకూ నిర్మించిన ప్రభుత్వ భవనాన్ని పరిశీలిస్తున్న బొంజుబాబు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» స్వయంగా వెళ్లి పరిశీలించిన ఎంఈవో బొంజుబాబు

» గ్రామపెద్దలతో చర్చించి తాత్కాలిక ఏర్పాట్లు

» సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామంటూ వెల్లడి

చీడికాడ, జూన్ 28 : మండలంలో కోనాం శివారు చెరకుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలన్నీ వాస్తవమే నని చీడికాడ ఎంఈవో బొంజుబాబు అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన 'ఎన్నాళ్లు ఈ చెట్లుకింద చదువులు' అనే కథనానికి స్పందించిన ఆయన సీఆర్పీ కృష్ణతో కలిసి వెంటనే చెరకుపల్లి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. చెట్లు కింద నేలపై చదువుతున్న విద్యార్థులను చూశారు. ఉపాధ్యా యులు, విద్యార్థులతో మాట్లాడారు. అలాగే శిథిలావస్థలో ఉన్న కమ్మల పాఠశాల, పునాదుల వరకూ నిర్మించిన పాఠశాల భవనాన్ని, శ్లాబు వరకూ నిర్మించిన వంటషెడ్డు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ పెద్దలతో మాట్లాడి పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యే లోపు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాఠశాల పాకను మరింత విశాలంగా నిర్మించేలా చర్యటు చేపట్టాలని పాఠశాల హెచ్ఎం వరహామూర్తిని ఆదేశించారు. నాడు-నేడు నిధులతో ఎంతమేర పని జరిగిందో పరిశీలించారు. ఈ పాఠశాలకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన సమస్యల న్నీ వాస్తవమేనని దీనిపై క్లుప్తంగా నివేదిక తయారుచేసి జిల్లా అధికారులకు నివేదించ నున్నట్టు ఎంఈవో తెలిపారు.

## శాస్త్రవేత్తల బృందం చెరకు తోటల పరిశీలన

చోడవరం, జూన్ 28 : మండలంలోని గోవాడ పరిధిలోని చెరకుతోటలను అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా చెరకుతోటలో వ్యాపిస్తున్న తెగుళ్లను గుర్తించడంతో పాటు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. చెరకులో ఎర్రకుళ్లు, ఎల్లో మొజాయిక్, పసుపుకుళ్లు తెగుళ్లు ఉన్నాయని వీటి నివారణకు పదికిలోల వేపపిండి, 90 కిలోల పశువుల ఎరువు, కిలో టివిడి మందు చాళ్ల మధ్యలో చల్లాలని సూచించారు. వరిసాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త చంద్రశేఖర్, దాడి ఉమామహేశ్వరరావు, పి.విజేత, స్థానిక వ్యవసాయశాఖ సహాయకురాలు కె.స్వాతి, చెరకు రైతులు పాల్గొన్నారు.



గోవాడలో చెరకుతోటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

## పోలీస్ ఉద్యోగులకు గ్రీవెన్స్



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 28 : జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులకు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న 18 మంది ఇక్కడికి విచ్చేసి ఎస్పీ కేవీ మురళీకృష్ణకు సమస్యలపై తమ గోడును విన్నవించారు. ప్రతి ఒక్కరితో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రంగురాళ్ల క్వారీని పరిశీలించిన స్క్వాడ్ డీఎఫ్‌వో



క్వారీని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

నర్సీపట్నం, జూన్ 28 : కరక రిజర్వ్ ఫారెస్టులోని రంగు రాళ్ల క్వారీలను విశాఖపట్నం ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం శుక్రవారం పరిశీలించారు. బీట్ ఇన్‌స్పెక్షన్ భాగంగా రంగురాళ్ల క్వారీ, బేస్ క్యాంప్, టేక్ ప్లాన్టేషన్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

# రేపు విద్యుత్ బిల్లులు స్వీకరణ

అనకాపల్లి టౌన్, జూన్ 28: జిల్లాలోని ఈపీడీసీఎల్ కలెక్షన్ కౌంటర్లు 30వ తేదీ ఆదివారం కూడా పనిచేస్తాయని, వినియోగదారులు విద్యుత్ చార్జీల బిల్లులను చెల్లించుకోవచ్చునని ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, రాజీవ్ ఈపీడీసీఎల్ కౌంటర్లలో, ఈ-సేవా, మీ-సేవా కేంద్రాల్లో బిల్లులు చెల్లించుకోవచ్చునని వివరించారు. ఫోన్ పే, గుగూల్ పే, పేటీఎంల ద్వారా కూడా చెల్లించవచ్చునని వివరించారు.

# ధార్మిక సమితుల ద్వారా హిందువుల్లో చైతన్యం నింపాలి

» విభాగ్ సంయోజక్ గరిమెళ్ళ రాధాకృష్ణ



నూకాంబిక ఆలయంలో సమావేశమైన సమరసతా సేవ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధులు

ఎస్.రాయవరం, జూన్ 28 : రానున్న రోజుల్లో అన్ని పంచాయతీల్లో ధార్మిక సమితులు వేసి, వాటి ద్వారా ఆలయాలు కేంద్రంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని విభాగ్ సంయోజక్ గరిమెళ్ళ రాధాకృష్ణ మండల కమిటీల కన్వీనర్లకు సూచించారు. ఇక్కడి నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశంలో మాట్లాడారు. ధార్మిక సమితి సభ్యులు గ్రూపులుగా ఏర్పడి గ్రామాల్లో తరుచూ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించి, హిందువుల్లో ఆధ్యాత్మిక భావాలను మరింత పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్, జిల్లా మహిళా కన్వీనర్ కలిగట్ల లలిత, జిల్లా మహిళా ప్రముఖ్ పోతు రంగారావు, జిల్లా పరియోజన ప్రముఖ్ శిరియాల సత్యనారాయణ, మండల కన్వీనర్ ముత్తా గోవిందరావు, మహిళా కన్వీనర్ పెదపాటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 2న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

చోడవరం, జూన్ 28: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే జూలై 2న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 12 ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థులు ఈ జాబ్‌మేళాను వినియోగించుకోవాలని సూచించారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించిన పూర్తి వివరాలు కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి సీనియర్ లెక్చరర్ హెచ్.సుధీర్ ఫోన్ : 77806 88683లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

# రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో చోడవరం విద్యార్థికి స్వర్ణ పతకం



స్వర్ణ పతకం సాధించిన సుందరరామిరెడ్డితో తల్లిదండ్రులు

చోడవరం, జూన్ 20: ఏపీ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 28 వరకూ హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థి నల్లమిల్లి సుందర రామిరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించాడు. పిస్తోల్ పోటీ వ్యక్తిగత విభాగంలో సుందరరామిరెడ్డి ఈ పతకాన్ని సాధించడం విశేషం. పట్టణానికి చెందిన వ్యాపారి గనిరెడ్డి కుమారుడైన సుందరరామిరెడ్డి గతంలో కూడా జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో సైతం పతకాలు సాధించాడు. ఈ ఏడాది రాష్ట్రస్థాయి పోటీల్లో సుందరరామిరెడ్డి బంగారుపతకం సాధించడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పాటు పలువురు సుందరరామిరెడ్డికి అభినందనలు తెలిపారు.

# ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించడం సంతోషకరం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి సత్యకుమార్‌కు కృతజ్ఞతలు

అధికార భాషా సంఘం మాజీ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్.టి.ఆర్ పేరును పునరుద్ధరించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌లకు పద్మవిభూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏయూలోని హిందీ భవన్‌లో శుక్రవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యకుమార్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ మేరకు తాను మెసేజ్ పెట్టినట్టు లక్ష్మీప్రసాద్ వెల్లడించారు. హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ అధికార భాష సంఘం చైర్మన్, హిందీ భాషా సంఘం చైర్మన్ పదవులకు తాను రాజీనామా చేశానని, కేబినెట్ హోదాతోపాటు మూడు లక్షల వేతనాన్ని వదులుకున్నానన్నారు. మళ్లీ, ఎన్టీఆర్ పేరును పునరుద్ధరించినందుకు ఆనందంగా ఉందన్నారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని, ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయని వైసీపీ ఓటమిపై మీడియా అడిగిన ప్రశ్నకు నర్మగర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరడాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు.

### హిందీ భాష అభివృద్ధికి కృషి

అంతర్జాతీయ స్థాయిలో హిందీ భాషకు గుర్తింపువచ్చేలా కృషి చేస్తున్నామని లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. అందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషిచేస్తున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులు హిందీ నేర్చుకోవాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో చట్టాలన్నీ హిందీలో వస్తాయన్నారు. హిందీని ఐక్యరాజ్య సమితి కూడా అధికార భాషగా గుర్తించాలన్నారు. ఈ మేరకు తాము కృషిచేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జె. ఈశ్వరమ్మ

## పంటలు, సాగు విస్తీర్ణం నమోదు చేయాలి

» తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ

**కె.కోటపాడు, జూన్ 28 :** అంతర్జాతీయ వ్యవసాయ గణన పేజ్-2పై గ్రామ రెవెన్యూ అధికారులకు శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ మాట్లాడుతూ 2021-22లో సాగు చేసిన వ్యవసాయ సాగు పంటలు, వ్యవసాయ విస్తీర్ణం వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. గణనను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలోఉప తహసీల్దార్ రమేష్‌బాబు, సహాయ గణాంకాధికారి రమాదేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.జానకి, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### బి.కింతాడ పాలసంఘం అధ్యక్షుడిగా దాసరి వెంకటరమణ

**దేవరాపల్లి, జూలై 28 :** బి.కింతాడ విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా దాసరి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ, వైసీపీ మద్దతుదారులు పోటీ చేయగా వెంకటరమణ (వైసీపీ) విజయం సాధించారు.

# సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ శ్రీకాంత్

» పారిశుధ్యం, వీధిలైట్లు పనితీరు బాగాలేదు
» మున్సిపాల్టీ సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు ధ్వజం
» అధికారులు పని చేయకపోవడం వల్లే వైసీపీ ఓటమి : కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం
» అయ్యన్నపాత్రుడికి అభినందనలు

**నర్సీపట్నం, జూన్ 28 :** మునిసిపాలిటీలో సమస్యలు పరిష్కరించడంపై అధికారులు శ్రద్ధ వహించాలని పలువురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన మునిసిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ముందుగా చైర్‌పర్సన్ కుమారుడు మృతికి కౌన్సిల్‌లో సంతాపం తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు మాట్లాడుతూ నర్సీపట్నం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి సభాపతి అయిన అయ్యన్నపాత్రుడుకు అభినందనలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరారు. 28వ వార్డు టీడీపీ కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్ మాట్లాడుతూ 12వ వార్డులో రూ.28 లక్షలతో చేపట్టనున్న శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులు సింగిల్ టెండర్ వస్తే సదరు కాంట్రాక్టర్‌కి ఆ పనిని ఎలా ఖాయ పరుస్తారని నిలదీశాలరు. దీన్ని వ్యతిరేకిస్తున్నామని, మళ్లీ టెండర్లు పిలవాలని సూచించారు. సచివాయాలలో వెబ్‌సైట్ పని చేయడం లేదని సర్టిఫికేట్లు జారీ చేయడం లేదన్నారు. సచివాలయాలకు స్టేషనరీ సరఫరా నిలిచి పోయిందని చెబుతున్నారని తెలిపారు. సర్టిఫికెట్లకి ఎంత ఫీజు తీసుకుంటారో ప్రతీ సచివాలయంలో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్యం పరిస్థితి, వీధి లైట్లు పనితీరు అధ్వానంగా ఉందన్నారు. పారిశుధ్య విభాగంలో ఉపయోగించే అద్దె ట్రాక్టర్లలో అవినీతి జరిగిందని గతంలో పలు ఆరోపణలు ఉన్నాయని, ఇప్పుడు టెండర్లు పిలవకుండా గతంలో ట్రాక్టర్లు అద్దెకు ఇచ్చిన వ్యక్తికే మళ్లీ ఎందుకు అవకాశం ఇస్తున్నారని ఏఈని నిలదీశారు. అజెండాలోని ఈ అంశాన్ని వ్యతిరేకిస్తున్నామని, టెండర్లు పిలిచి ట్రాక్టర్లు అద్దెకు తీసుకు కోవాలని సూచించారు.

వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు మాట్లాడుతూ అన్న క్యాంటీన్ భవనం మరమ్మతులు మునిసిపాలిటీ జనరల్ ఫండ్ నిధులతో చేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. గతంలోసాధారణ నిధుల నుంచి దేనికైనా ఖర్చు చేస్తే టీడీపీ కౌన్సిలర్లు నిలదీసేవారని, ఇప్పుడు అన్న క్యాంటీన్‌కి ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. ఏఈ రవి మాట్లాడుతూ పుర పరిపాలన సంచాలకులు సర్క్యులర్ ఆధారంగా అన్న క్యాంటీన్ మరమ్మతు పనులు చేపట్టామని తెలిపారు. జనసేన కౌన్సెలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ ఎక్స్‌కవేటర్ తొమ్మిది నెలలుగా పని చేయక పోయినా డీజిల్ బిల్లులు ప్రతీ నెలా పెటుకుంటున్నారని ఆరోపించారు.

**అధికారుల పనితీరు వల్లే వైసీపీ ఓటమి**

వైసీపీ కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం మాట్లాడుతూ మునిసిపాలిటీలో పారిశుధ్యం, వీధిలైట్లు సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే వైసీపీ ఓటమి పాలైందన్నారు. ఈ సమావేశంలో కౌన్సెలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 1న పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు


» ఎంపీడీవో ఉమామహేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

**చీడికాడ, జూన్ 28 :** ప్రభుత్వ పింఛన్ తీసుకొంటున్న పింఛన్ లబ్ధిదారులందరినీ జూలై 1వ తేదిన గ్రామాల్లో సిద్ధంగా ఉంచాలని, ఉద్యో గులంతా ముందుగా వారికి సమా చారం ఇవ్వాలని ఎంపీడీవో ఉమా మహేశ్వరి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలోశుక్రవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో పాటు వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ నెల ప్రభుత్వం నుంచి పింఛన్ తీసుకునే దివ్యాంగులు, వృద్ధులు, ఇతర పింఛన్‌దారులు అందరినీ జూలై 1న సోమవారం నాటికి ఆయా గ్రామాల్లో గృహాల వద్ద సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఎవరైనా వలస వెళితే వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వెంటనే రప్పించాలని కోరారు. అలాగే గ్రామాల్లో మంచినీరు, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు సోకిన వెంటనే వైద్యసిబ్బందితో పాటు ఇతర అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.శ్రీకాంత్, వెలుగు ఏపీఎం చీకటి శ్రీనివాస్, ఉపాధి ఏపీవో సియ్యాద్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.







# ఏయూ వీసీ అవుట్

... 5వ పేజీ తరువాయి

రాజీనామా చేయడానికి ముందే అకడమిక్ డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ కిశోర్‌బాబుకు రిజిస్ట్రార్‌గా అడిషనల్ చార్జ్ అప్పగించారు.

**వివాదాస్పద నిర్ణయాలే కారణం..**

వీసీగా ప్రసాదరెడ్డి తీసుకున్న అనేక నిర్ణయాలు ప్రస్తుతం ఆయనపై తీవ్ర వ్యతిరేకతకు కారణమయ్యాయి. వైసీపీ అధి కారంలోకి వచ్చి నప్పటి నుంచి ఇప్పటివరకూ తొలుత ఇన్‌చార్జి గా, ఆ తరువాత పూర్తిస్థాయి వీసీగా కొనసాగిన ప్రసాదరెడ్డి... వర్సిటీని ఒకరకంగా ఆ పార్టీ కార్యాలయంగా మార్చేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఆయన తల్లి విజయ లక్ష్మి, రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి పుట్టినరోజు వేడుకలను తన ఛాంబర్‌లో నిర్వహించారు. అలాగే వీసీగా ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పద మయ్యా యి. ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను నిబంధనలకు విరుద్ధంగా మూడుసార్లు రిజిస్ట్రార్‌గా తీసుకున్నారు. ఆ తరువాత కూడా ఆయనకు ఏయూ లో ఎన్నడూ లేని విధంగా ఓఎస్‌డీ పోస్టును సృష్టించి బాధ్యతలను అప్పగించారు. అదేవిధంగా ఏయూతో సంబంధం లేని బయటి వ్యక్తి అయిన జేమ్స్ స్టీఫెన్‌ను రిజిస్ట్రార్ సీటులో కూర్చోబెట్టారు. యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చైర్ ప్రొఫెసర్‌గా ఉన్న వ్యక్తికి రిజిస్ట్రార్ పోస్టు దక్కేలా చక్రంతిప్పారు. ఇది అప్పట్లోనే సంచలనం అయింది.

**అస్మదీయులకు పదవుల పందేరం**

వీసీ ప్రసాదరెడ్డి తన హయాంలో అస్మదీయులకు పెద్ద ఎత్తున పదవుల పందేరం చేశారన్న విమర్శలు ఉన్నాయి. తనకు కావాల్సిన వారిని కీలక స్థానాల్లో కూర్చోబెట్టుకున్నారు. ఇరవై మందికిపైగా రిటైర్డ్ ఉద్యోగులకు కీలక స్థానాలను కట్టబెట్టారు. చైర్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, గౌరవ ప్రొఫెసర్లు పేరుతో ఎంతో మందిని నియమించుకుని భారీగా వేతనాలు ఇచ్చారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్లను, వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలను కూడా వీసీ ప్రసాదరెడ్డి నియమించు కున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వీసీ వర్సిటీలోకితీసుకువచ్చి కీలక విభాగాల్లో నియమించారు. అలాగే, రిటైర్డ్ పోలీస్ అధికారికి భారీగా వేతనాన్ని ఇచ్చి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించుకున్నారు.అంతేగాకుండా పదుల సంఖ్యలో సెక్యూరిటీ గార్డులను నియమించు కుని ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటుచేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో తనకు నచ్చని వారిని పక్కనబెట్టేశారు. సుమారు 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీని తొలగించేందుకు 28కిపైగా కోర్సులను రద్దు చేసేశారు.

**పచ్చని చెట్లపై వేటు**

జాతీయ స్థాయిలో వర్సిటీ ఖ్యాతిని మంటగలిపే మరో చర్యకు వీసీ ప్రసాదరెడ్డి పాల్పడ్డారు. వందలాది ఎకరాల్లో ఉన్న వేలాది వృక్షాలు, చెట్లను తొలగించేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే వంకతో పచ్చదనంపై వేటువేశారు. ఓ ప్రైవేటు వ్యక్తికి ఈ స్థలాన్ని కట్టబెట్టేందుకు యత్నించారని, అన్నివర్గాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని వర్సిటీలోని అధికారులే చెబుతున్నారు.

**విద్యార్థులకు దూరంగా వీసీ కార్యాలయం**

విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా వీసీ కార్యాలయానికి వచ్చి చెప్పుకునే అవకాశాన్ని ప్రసాదరెడ్డి పూర్తిగా దూరం చేశారన్న విమర్శలు ఉన్నాయి. తాను బాధ్యతలు చేపట్టిన వెంటనే వీసీ కార్యాలయం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయించారు. ఎవరైనా లోపలకు వెళ్లాలంటే సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి. గతంలో ఏవైనా ఇబ్బందులుంటే విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించేవి. వీసీగా ప్రసాదరెడ్డి వచ్చిన తరువాత అటువంటి పరిస్థితే లేకుండా పోయింది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా భరించాల్సిందే తప్ప..బయటకు చెప్పకోలేని పరిస్థితి విద్యార్థులకు ఏర్పడింది. మరోవైపు అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా వర్సిటీలో గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం కూడా పెరిగిపోయింది. సాధారణంగా ప్రభుత్వాలు మారినా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఈ తరహాలో రాజీనామా చేయడం ఎప్పుడూ లేదు. కానీ, వీసీ ప్రసాదరెడ్డి వ్యవహారశైలే అందుకు దారి తీసిందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. వీసీ, రిజిస్ట్రార్‌ల రాజీనామాతో విద్యార్థి, అధ్యాపక సంఘాలు ఆనందాన్ని వ్యక్తం చేశాయి. సాయంత్రం ఐదు గంటలకు ఏయూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. గడిచిన ఐదేళ్ల నుంచి వీసీ ప్రసాదరెడ్డి కబంధ హస్తాల్లో చిక్కుకున్న ఏయూలో ఎట్టకేలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడిందన్న ఆనందాన్ని వ్యక్తంచేశారు.

**వీసీ పోస్టుకు ప్రయత్నాలు**

ప్రసాదరెడ్డి రాజీనామా చేయడంతో ఏయూ వీసీ పోస్టు కోసం పలువురు సీనియర్ ప్రొఫెసర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళం అంబేడ్కర్ వర్సిటీ వీసీగా పనిచేసి ప్రస్తుతం ఏయూలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ కూన రాంజీ, ఏయూ ఫారిన్ అఫైర్స్ డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ధనుంజయ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ నరసింహరావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ శశిభూషణ్, తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

ప్రస్తుతానికి ఇన్‌చార్జి వీసీని నియమించి, ఆ తరువాత పూర్తిస్థాయి వీసీ ఎంపిక కోసం సెర్చ్ కమిటీని ప్రభుత్వం వేయనున్నది.

# మొక్కు'బడులే'

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులతోనే నడుస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. మండలంలో ఒకటి, రెండు తరగతుల్లో చదివే అత్యధిక విద్యార్థుల సంఖ్య 31 అంటే మిగిలిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని గవరవరంలో ఒకటో తరగతిలో ఒక విద్యార్థి, రెండో తరగతిలో ఒక విద్యార్థి ఉన్నారు. ఈ గ్రామంలో నాడు-నేడు కింద పాఠశాల భవనాన్ని అందంగా తయారుచేసిన మీదట, ఆ పాఠశాలలోని మూడు నుంచి ఐదు విద్యార్థులను హైస్కూల్‌కు తరలించేశారు. దీంతో మిగిలిన పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపించివేశారు. ఆ పాఠశాలలో విద్యార్థులకు చక్కగా బోధన అందించే ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థులు ఇద్దరే ఉండడం గమనార్హం. ఇక మండలంలోని అంకుపాలెం, కోమటి వీధి పాఠశాలల్లో ఈ ఏడాది ఒకటో తరగతి ప్రవేశాలు లేవు. మిగిలిన పాఠశాలల్లో సైతం ఒకరు లేదా ఇద్దరు చేరారు. మండలంలోని రెండు పాఠశాలల్లో మాత్రం ఒకటో తరగతిలో పది మంది విద్యార్థులు చేరారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన వారి సంఖ్య సింగిల్ నంబరులోనే ఉంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు కలిపి పది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలే ఎక్కువగా ఉన్నాయి. అద్దూరులో 6, జెన్నవోలులో 5, జన్నవరంలో 6, రామజోగిపాలెంలో 5, చాకిపల్లిలో 4, భోగాపురంలో 6, ముద్దుర్తిలో 9, ఖండేపల్లిలో 8, జుత్తాడలో 4, నసరయ్యపేటలో 4 ఇలా సింగిల్ నంబరులోనే విద్యార్థుల సంఖ్య ఉంది. ఇక సింహాద్రిపురంలో రెండో తరగతిలో ఒకరు. పట్టణంలోని చందకవీధిలో ఒకటో తరగతికి ఒకరు. రెండో తరగతికి ఒకరు. అంకుపాలెం ఇద్దరు ఇలా విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ ప్రాథమిక బడులలో ఈ విద్యార్థుల సంఖ్య విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తికి కూడా పొంతన లేకుండా ఉండడం గమనార్హం. వేలాది రూపాయల వేతనాలతో పనిచేసే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నప్పటికీ, వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన అస్తవ్యస్త విధానాలతో వేల రూపాయలు ఖర్చు పెట్టి మరీ విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపించివేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దే చర్యలు చేపడితే తప్ప గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు మునుపటి కళ రాదని అంటున్నారు

## పల్లాకు తాతయ్యబాబు అభినందనలు



**బుచ్చెయ్యపేట, జూన్ 28 :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పల్లా బాధ్యతలు స్వీకరణకు తాతయ్యబాబు హాజరయ్యారు. నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తారని తాతయ్యబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.




## గొలుగొండ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి పరీక్షలు

**గొలుగొండ, జూన్ 27 :** మండలంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి శుక్రవారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రామకృష్ణ పర్యవేక్షణలో ఈ పరీక్షలు చేపట్టారు. ఈ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో 70 మిగులు సీట్ల భర్తీ పరీక్షలకు 154 మంది ఆన్‌లైన్ దరఖాస్తు చేయగా 137 మంది పరీక్షలకు హాజరైనట్టు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు.



పరీక్షలు నిర్వహిస్తున్న ఎంఈవో, ప్రిన్సిపాల్










# అడ్డగోలుగా ప్లానింగ్!

... 5వ పేజీ తరువాయి

చూడలేదు. ఇటీవల మీడియాలో ఈ విషయం బయటకు పొక్కడంతో హడావిడిగా నోటీసులు జారీ చేశారు.

**అడ్డగోలు నిర్మాణాలకు పచ్చజెండా**

అనకాపల్లి జీవీఎంసీ పరిధిలో గడిచిన మూడు నెలలుగా పూర్తికాల టౌన్ ప్లానింగ్ అధికారి లేరు. ఇక్కడ పనిచేస్తున్న ఏటీపీ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఎన్నికల ముందు వేరొకరిని నియమించారు. అయినా అడ్డగోలు అనుమతులు, అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. స్థానిక వైసీపీ నేతలే మధ్యవర్తులుగా ఉంటూ అక్రమ నిర్మాణదారులతో బేరసారాలు కుదిర్చి, అడ్డగోలుగా భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారులు తమకు అందాల్సిన వాటాలు అందితే చాలు బహుళ అంతస్తుల నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. అనకాపల్లి పట్టణ పరిధిలో 84 వార్డులోని రఘురామ్ కాలనీలో గతంలో పనిచేసిన టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి ఒకరు వైసీపీ నేతల స్థలాలకు ప్రయోజనం చేకూర్చేందుకు వీలుగా ఏకంగా పట్టణ టౌన్ ప్లాన్ బ్లూప్రింట్‌లోని 80 అడుగులు రోడ్డును పూర్తిగా కనిపించకుండా చేశారనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల ముందు వరకు పనిచేసి బదిలీపై వెళ్లిపోయిన సదరు అధికారి లక్షలు వసూలు చేసి బ్లూప్రింట్‌లో మార్పులు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పట్లో ఇదే కాలనీలో మరొక వైసీపీ నేతకు అనుకూలంగా 60 అడుగుల రోడ్డును బ్లూప్రింట్‌లో కేవలం 10 అడుగుల రోడ్డుగా మార్పులు చేశారు. ఈ అడ్డగోలు వ్యవహారంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు భారీగానే ముడుపులు గుంజినట్టు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి టౌన్‌ప్లాన్ విభాగంలో బ్లూప్రింట్‌లో ఎటువంటి మార్పులు చేయాల్సి వున్నా, ఆయా ప్రాంతాల్లో ఉన్న లేఅవుట్ పరిధిలో భూ యజమానులతో చర్చించి, జీవీఎంసీ కమిషనర్ ఆమోదం పొందాలి. కానీ రఘురామ కాలనీలో టౌన్ ప్లానింగ్ అధికారులు 80 అడుగుల రోడ్డును కనిపించకుండా చేయడమే కాకుండా, 60 అడుగుల రోడ్డును ఏవిధంగా 10 అడుగులు రోడ్డుగా చూపుతున్నారో అర్థం కాని ప్రశ్నలుగా మారిపోయాయి. దీనిపైస్థానికులు జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అంతేకాకుండా ఇదే రఘురామ్ కాలనీకి సమీపంలో ఎటువంటి రోడ్లు లేకుండానే ప్రస్తుతం వున్న టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు కొత్తగా మరికొన్ని బహుళ అంతస్తుల నిర్మాణ పనులకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రసన్నం చేసుకుంటే చాలు.. అడ్డగోలు నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తున్నారు. 84వ వార్డులోని రఘురామ్ కాలనీకి సమీపంలో ప్రస్తుతం జరుగుతున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కనీసం రోడ్డు లేకుండానే పెద్ద పెద్ద అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తున్నారంటే అధికారుల అడ్డగోలు వ్యవహారాలు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చిన నేపథ్యంలోనైనా అనకాపల్లి పట్టణంలో అక్రమ కట్టడాలకు అడ్డగోలు అనుమతులు ఇవ్వకుండా ప్రక్షాళన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుందని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# చెరకుపల్లి ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు వాస్తవమే



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో



పునాదుల వరకూ నిర్మించిన ప్రభుత్వ భవనాన్ని పరిశీలిస్తున్న బొంజుబాబు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

- స్వయంగా వెళ్లి పరిశీలించిన ఎంఈవో బొంజుబాబు
- గ్రామపెద్దలతో చర్చించి తాత్కాలిక ఏర్పాట్లు
- సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామంటూ వెల్లడి

**చీడికాడ, జూన్ 28 :** మండలంలో కోనాం శివారు చెరకుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలన్నీ వాస్తవమేనని చీడికాడ ఎంఈవో బొంజుబాబు అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన 'ఎన్నాళ్లు ఈ చెట్లుకింద చదువులు' అనే కథనానికి స్పందించిన ఆయన సీఆర్పీ కృష్ణతో కలిసి వెంటనే చెరకుపల్లి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. చెట్లు కింద నేలపై చదువుతున్న విద్యార్థులను చూశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. అలాగే శిథిలావస్థలో ఉన్న కమ్మల పాఠశాల, పునాదుల వరకూ నిర్మించిన పాఠశాల భవనాన్ని, శ్లాబు వరకూ నిర్మించిన వంటషెడ్డు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ పెద్దలతో మాట్లాడి పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యే లోపు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాఠశాల పాకను మరింత విశాలంగా నిర్మించేలా చర్యలు చేపట్టాలని పాఠశాల హెచ్ఎం వరహామూర్తిని ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలకు నాడు-నేడు కింద నిధులు మంజూరు, ఎంత నిధులు విడుదల అయింది. ఎంతమేర పని జరిగిందో పరిశీలించారు. ఈ పాఠశాలకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన సమస్యలన్నీ వాస్తవమేనని దీనిపై క్లుప్తంగా నివేదిక తయారుచేసి జిల్లా అధికారులకు నివేదించనున్నట్టు ఎంఈవో తెలిపారు.

# శాస్త్రవేత్తల బృందం చెరకు తోటల పరిశీలన

**చోడవరం, జూన్ 28 :** మండలంలోని గోవాడ పరిధిలోని చెరకుతోటలను అనకాపల్లి వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా చెరకుతోటలో వ్యాపిస్తున్న తెగుళ్లను గుర్తించడంతో పాటు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. చెరకులో ఎర్రకుళ్లు, ఎల్లో మొజాయిక్, పసుపుకుళ్లు తెగుళ్లు ఉన్నాయని వీటి నివారణకు పదికిలోల వేపపిండి, 90 కిలోల పశువుల ఎరువు, కిలో టివిడి మందు చాళ్ల మధ్యలో చల్లాలని సూచించారు. వరిసాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త చంద్రశేఖర్, దాడి ఉమామహేశ్వరరావు, పి.విజేత, స్థానిక వ్యవసాయశాఖ సహాయకురాలు కె.స్వాతి, చెరకు రైతులు పాల్గొన్నారు.



గోవాడలో చెరకుతోటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

## రైఫిల్ షూటింగ్‌లో చోడవరం విద్యార్థికి స్వర్ణ పతకం

**చోడవరం, జూన్ 20 :** ఏపీ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 28 వరకూ హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థి నల్లమిల్లి సుందరరామిరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించాడు. పిస్తోల్ పోటీ వ్యక్తిగత విభాగంలో సుందరరామిరెడ్డి ఈ పతకాన్ని సాధించడం విశేషం. పట్టణానికి చెందిన వ్యాపారి గనిరెడ్డి కుమారుడైన సుందరరామిరెడ్డి గతంలో కూడా జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో సైతం పతకాలు సాధించాడు. ఈ ఏడాది రాష్ట్రస్థాయి పోటీల్లో సుందరరామిరెడ్డి బంగారు పతకం సాధించడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పాటు పలువురు సుందరరామిరెడ్డికి అభినందనలు తెలిపారు.



స్వర్ణ పతకం సాధించిన సుందరరామిరెడ్డితో తల్లిదండ్రులు

## కరక రంగురాళ్ల క్వారీని పరిశీలించిన స్క్వాడ్ డీఎఫ్‌వో

**నర్సీపట్నం, జూన్ 28 :** కరక రిజర్వ్ ఫారెస్టులోని రంగు రాళ్ల క్వారీలను విశాఖపట్నం ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం శుక్రవారం పరిశీలించారు. బీట్ ఇన్‌స్పెక్షన్ భాగంగా రంగురాళ్ల క్వారీ, బేస్ క్యాంప్, టేక్ ప్లాన్టేషన్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.



పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

## విత్తనాలు పంపిణీ

**మాకవరపాలెం, జూన్ 28 :** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని టీడీపీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు తమరాన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని వజ్రగడ, మాకవరపాలెం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలో శుక్రవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు.



విత్తనాలు అందిస్తున్న టీడీపీ నేతలు

# గోవాడ షుగర్స్ పూర్వవైభవానికి కృషి

- నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

**చోడవరం, జూన్ 28 :** గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యల పరిష్కారంతో పాటు ఫ్యాక్టరీకి పునర్వైభవానికి సీఎం చంద్రబాబు, తమ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో కృషి చేస్తామని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం ఆయన జనసేన నాయకులతో కలిసి గోవాడ ఫ్యాక్టరీలో ఎండీ వి.సన్యాసినాయుడుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించిన రాజు, ఫ్యాక్టరీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, సిరిపురపు రమేష్, కర్రి రమేష్, డీఎస్ నాయుడు, కర్రి తమ్మునాయుడు, గూనూరు సూర్యనారాయణ, మహేష్, మాలినాయుడు, నాలుగు మండలాల నుంచి ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



గోవాడ ఫ్యాక్టరీలో ఎండీ సన్యాసినాయుడుతో సమావేశం రాజు, జనసేన నేతలు

## వైద్య శిబిరంలో 100 మందికి పరీక్షలు

**కృష్ణాదేవిపేట, జూన్ 28 :** గొలుగొండ మండలం లింగందొరపాలెం పంచాయతీ తాళ్ళచీడికాడలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ రోగులకు పరీక్షించి రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులకు కారణమైన దోమలు లార్వాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్లప్పుడూ పరిసరాలు పరిశుభ్రత ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణ, నూకరత్నం, ఆశ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లకు మరమ్మతు చేపట్టకుంటే జలదీక్ష

**సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు**



విలేకరులతో మాట్లాడుతున్న గోవిందరావు

**రావికమతం, జూన్ 28 :** రావికమతం, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండలాల పరిధిలో చెరువులా మారి వాహన చోదకులు, ప్రయాణికులకు ఇక్కట్లుకు గురి చేస్తున్న బీఎన్ రోడ్డు గోతులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, లేదంటే జలదీక్ష చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గోవిందరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకూ సుమారు 50 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.79.89 కోట్లు నిధులు మూడేళ్ళ క్రితమే మంజూరైనప్పటికీ అప్పటి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ రోడ్డు అభివృద్ధి పనులు చేయించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈ రోడులో పరిమితికి మించి గ్రానైట్ లారీలు తిరగడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైయిందన్నారు. ఇటీవల వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఆదేశించినా ఇంతవరకూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టకుంటే సీపీఎం ఆధ్వర్యంలోనిరసన చేపడతామన్నారు.

## 'మత్తు'కు దూరంగా ఉండాలి

**దేవరాపల్లి, జూన్ 28 :** మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, మంచిగా చదివి లక్ష్యాలను అధిగమించాలని ఏఐటీయూసీ సంఘం కార్యదర్శి రాయి సింహాద్రప్పడు అన్నారు. శుక్రవారం గరికిన యల్లారావుతో కలిసి విద్యార్థులకు మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఎదురయ్యే అనర్థాల గురించి వివరించారు. మత్తుకు అలవాటు పడిన వారి భవిష్యత్తు నాశనం కాకుండా కుటుంబం క్షోభ అనుభవిస్తుందని చెప్పారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా కెరీర్‌లో ఎదిగేందుకు మాత్రమే ప్రతి విద్యార్థి దృష్టి సారించాలన్నారు. అప్పుడే ఉత్తమ పౌరులు కాగలరని పేర్కొన్నారు.

## నేటి నుంచి కల్యాణోత్సవాలు

**చోడవరం, జూన్ 20 :** మండలంలోని లక్కవరంలో ఈ నెల 29 నుంచి లక్ష్మీభూపతి వేంకటేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ చతుర్ధస వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 2 వరకూ కొనసాగుతాయని ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ వివిధ పూజా కార్యక్రమాలు నిత్యహోమాలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని చెపారు.

### నేడు కృష్ణాదేవిపేటలో నేత్ర వైద్య శిబిరం

**కృష్ణాదేవిపేట, జూన్ 28 :** గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శంకర్ ఫౌండేషన్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ శిబిరం లో కృష్ణాదేవిపేటతో పాటు పరిసర ప్రాంతాల నేత్ర రోగులు సద్వినియోగ పర్చుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ శిబిరంలో ఉచిత వైద్య సేవలతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్టు చెప్పారు.